సాక్షి
పెద్దపల్లి
బుధవారం । 11 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

సంపత్‌కుమార్‌కు సీఎం అభినందన



సంపత్ కుమార్‌ను సన్మానిస్తున్న సీఎం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తాడూరి సంపత్ కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. కాలనీకి చెందిన సంపత్‌కుమార్ 15 ఏళ్లుగా రామగిరి మండలం సుందిళ్ల– చందనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన చేస్తున్నారు. విద్యాబోధనలతో ప్రతిభ చూపి 2017లో జిల్లా, 2020లో రాష్ట్ర, 2024లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. వీటితోపాటు మరెన్నో పురస్కారాలు అందుకున్న ఆయన ఇటీవల సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జెడ్పీ హైస్కూల్‌కు బదిలీపై వెళ్లారు.

గణేశుని సన్నిధిలో పూజలు



వినాయకుని దర్శనం తర్వాత సీపీ శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద 54 అడుగుల గణేశుడిని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం రాత్రి దర్శించుకుని పూజలు చేశారు. ఛత్రపతి యువసేన వ్యవస్థాపకుడు శివంగారి సతీశ్‌కు పలు సూచనలు చేశారు. మండప నిర్వాహకులు, పోలీసులు సమన్వయంతో నిమజ్జన శోభాయాత్ర ముగిసేవరకూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీసీపీ చేతన, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్, ఎస్సై లక్ష్మణ్‌రావు ఉన్నారు.

కార్మిక సంక్షేమంపై దృష్టి

గోదావరిఖని: కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీవర్షాలతో బొగ్గు ఉత్పత్తి తగ్గిందని, ఈఏడాది ఇప్పటివరకు 20.46లక్షల టన్నులకు 17.92లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి నిర్దేశిత లక్ష్యంలో 87శాతం నమోదు చేశామని వివరించారు. పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఏరియా ఇంజినీరు వెంకటేశ్వర్‌రావు, ఐఈడీ ఏజీఎం ఆంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఫైనాన్స్ డీజీఎం ధనలక్ష్మీబాయి, క్వాలిటీ అధికారి సాయిప్రసాద్, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పీవో పాల్గొన్నారు.

‘ఎమ్మెల్సీ’ హీట్!

ఆశావహుల ముందస్తు ప్రచారం

- వచ్చేనెల ఒకటి నుంచి ఎన్‌రోల్‌మెంట్ మొదలు
- పట్టభద్రుల వివరాల సేకరణ
- ప్రధాన పార్టీల నుంచి బలమైన అభ్యర్థులు
- మున్ముందు మరింత పెరగనున్న పోటీ



బీఎన్ రావు రవీందర్‌సింగ్ నరేందర్‌రెడ్డి వి. రాజేందర్‌రావు పి.సుగుణాకర్‌రావు రాణీరుద్రమ



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆశావహులు స్పీడు పెంచారు. అక్టోబరు ఒకటి నుంచి పట్టభద్రులు ఎన్‌రోల్‌మెంట్ చేసుకునేందుకు ఇటీవల ఎన్నికల కమిషన్ అనుమతించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల స్థానానికి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావహులు స్పీడు పెంచారు. ఎవరికి వారు తాము అభ్యర్థులమన్న సంకేతాలు ఇస్తున్నారు. మరికొందరు అడుగు ముందుకేసి అప్పుడే మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ పోటీలో అధికార కాంగ్రెస్‌తోపాటు బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీ అభ్యర్థులు సైతం తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఇంట గెలిచి, రచ్చ గెలవాలన్న సామెత వీరిలో చాలా మందికి వర్తించకపోవడం గమనార్హం. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధంగా ఉండటం విశేషం. మున్ముందు ఈ పోటీ ఇటు అన్ని పార్టీల్లో పెరిగి, స్వతంత్రుల సంఖ్యా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

గులాబీ పార్టీలో ఇద్దరి మధ్యే పోటీ

బీఆర్‌ఎస్ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో బీఎన్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.బీఎన్‌రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ ప్రముఖంగా ఉన్నారు. బీఎన్‌రావు ముందు నుంచి ఎమ్మెల్సీ స్థానం కోసం గ్రౌండ్‌వర్క్ చేస్తున్నారు. కొన్నేళ్లుగా పేదలకు చేస్తున్న ఉచిత మోకీలు ఆపరేషన్లతోపాటు.. ఎమ్మెల్సీ ఎన్నికలే లక్ష్యంగా మేధావులతో సమావేశాలు, ఎంఐఏ మాజీ రాష్ట్ర అధ్యక్షుడిగా వైద్య, పారా మెడికల్ సిబ్బంది మద్దతు కోరుతున్నారు. నిరుద్యోగులకు పోటీపరీక్షల మెటీరియల్స్ అందజేస్తున్నారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్ కూడా ఎమ్మెల్సీ రేసులో సీరియస్‌గానే ఉన్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో తనకు వచ్చిన ఓట్లు, మేయర్‌గా అందించిన సేవలు, ప్రైవేటు టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగడుతున్నారు.

నరేందర్‌రెడ్డి వర్సెస్ వెలిచాల..

కాంగ్రెస్ నుంచి ఆశావహుల జాబితా చాంతాడంత ఉంది. ప్రస్తుతం ఇద్దరు బలమైన అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నారు. వీరిలో ఒకరు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్ రెడ్డి కాగా, మరొకరు ఇటీవల కరీంనగర్ పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వెలిచాల రాజేందర్‌రావు. నరేందర్ రెడ్డి కాంగ్రెస్ తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తుందని బలంగా నమ్ముతున్నారు. టికెట్ రాకపోయినా స్వతంత్రుడిగానైనా పోటీలో నిలబడాలన్న ఆలోచనలో ఉన్నారు. ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్‌రోల్‌మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా ఉన్నారు. సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్‌లో శిక్షణ, గ్రాడ్యుయేట్లకు మేనిఫెస్టోలతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా అవకాశమిస్తే సిద్ధమేనని, పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.

కమలనాథుల్లో ఉత్కంఠ..

బీజేపీలోనూ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇద్దరి మధ్య తీవ్రపోటీ నెలకొంది. వారిలో ఒకరు సీనియర్ నేత పొల్సాని సుగుణాకర్ రావు, మరొకరు రాణీ రుద్రమ. వీరిద్దరూ తమకు టికెట్ కావాలని అధిష్టానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని, ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీరుద్రమకు సిరిసిల్ల నుంచి అవకాశం కల్పించారని, కాబట్టి ఈసారి తమకు ఇవ్వాల్సిందేని సుగుణాకర్‌రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీ రుద్రమ మాత్రం తన ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

అభ్యంతరాలు పరిష్కరించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష

రామగుండం: అంతర్గాం మండలంలోని భూసేకరణ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మొగల్‌పహాడ్‌లో ఎన్టీపీసీ యాష్‌పాండ్ నిర్మాణానికి అవసరమైన 606 ఎకరాలను మంగళవారం పరిశీలించారు. భూసేకరణపై రైతుల నుంచి వస్తున్న అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రామగుండంలో ఏర్పాటు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. భవిత సెంటర్‌ను సందర్శించారు. అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ, పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు గంగయ్య, హనుమా నాయక్, తహసీల్దార్ రమేశ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా భూసేకరణ

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణికి అవసరమైన భూసేకరణను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. రామగిరి మండలం సుందిళ్లలో పెండింగ్ భూసేకరణ ప్రాంతాన్ని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆర్జీ–1 ఏరియాలో 49ఎకరాల పట్టా, 269 ఎకరాల ప్రభుత్వ భూమిని సింగరేణికి లీజుకు ఇచ్చామని తెలిపారు. ఇందులో సాగు చేసుకుంటున్న కొందరు రైతుల అభ్యంతరాలు పరిష్కరించాలని సూచించారు.



భవిత కేంద్రంలో కలెక్టర్ కోయి కోయ శ్రీహర్ష

చర్చిస్తారా.. చప్పట్లు కొడతారా?

- ఇది గోదావరిఖని ప్రధాన చౌరస్తాలోని చిత్రం. ఇక్కడ నిత్యం రద్దీ అధికంగా ఉంటుంది. నడిరోడ్డుపై పశువులు ఇలా సేద దీరడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల జరిగిన బల్దియా సమావేశంలో పశువులను గోశాలలకు తరలించాలని ఎమ్మెల్యే ఎస్ఎస్ రాజ్‌ఠాకూర్ సూచించినా ప్రయోజనం లేకుండాపోయింది.



- ఇతడి పేరు కన్నూరి సతీశ్‌కుమార్. రామగుండం 20వ డివిజన్ కార్పొరేటర్. తన డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని మొరపెట్టుకున్నా అధికారులు పెడచెవిన పెట్టడంతో బల్దియా మెట్లపై కూర్చొని ఇలా నిరసన తెలిపారు. ఇతనే కాదు.. లోతట్టు ప్రాంతమైన పద్మావతికాలనీ వరదలో మునిగిపోతోందని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత ఇటీవల బురద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కార్పొరేటర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపానికి ఈ నిరసన ప్రదర్శనే నిదర్శనంగా నిలుస్తోంది.



- ఇది బల్దియా కౌన్సిల్ హాల్. గతేడాది అక్టోబర్ ఐదో తేదీన 14వ సాధారణ సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మళ్లీ సమావేశం కాలేదు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అప్పుడు మూవేసిన ఆఫీసు తలుపులను మంగళవారం తెరిచారు. 15వ జనరల్ బాడీ సమావేశం నిర్వహణకు పోడియం, టేబుళ్లు, హాల్‌ఫ్లోర్‌పై పేరుకుపోయిన దుమ్ము ఇలా దులుపుతున్నారు.



- డంపింగ్ యార్డు ఏర్పాటుకు కలగని మోక్షం
- ఉద్యోగుల వేతనాలు, అద్దెవాహనాలపైనే ఫోకస్
- ఎజెండాలోనూ ప్రజాసమస్యలకు దక్కని చోటు
- నేడు రామగుండం నగర 15వ సాధారణ సమావేశం



ఇది గోదావరిఖని దుర్గానగర్. ఎమ్మెల్యే నివసించే అపార్ట్‌మెంట్ ఇక్కడే ఉంది. యూజీడీ కోసం తవ్వి వదిలేసిన రోడ్డు ఇటీవల కురిసిన వర్షంతో ఇలా బురదగా మారింది. కనీసం కాలినడక కూడా గగనంగానే తయారైంది.

కోల్‌సిటీ(రామగుండం): సుమారు 11 నెలల క్రితం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం నిర్వహించారు. దాదాపు ఏడు నెలల క్రితం బడ్జెట్‌పై పాలకవర్గం సమావేశమైంది. ఆ తర్వాత ఒక్కసారి కూడా పాలకులు, అధికారులు సమావేశమైన దాఖలాల్లేవు. ప్రజాసమస్యలపై చర్చించిన నాథుడే లేడు. పరిష్కరించిన అధికారి కూడా కానరావడం లేదు. ఒకవైపు భారీవర్షాలు, లోతట్టు ప్రాంతాలకు ముంపు ముప్పు భయం.. మరోవైపు లోపించిన పారిశుధ్యం, చిత్తడైన రహదారులు, విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు నగరవాసులను పట్టిపీడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం నగర మేయర్ బంగి అనిల్‌కుమార్ అధ్యక్షతన 15వ సాధారణ సమావేశం నిర్వహణకు సర్వం సిద్ధమైంది. కానీ, ప్రజాసమస్యలపై కాకుండా బల్దియా ఉద్యోగుల వేతనాలు, అధికారుల అద్దె వాహనాల బిల్లుల చెల్లింపులు తదితర 15 అంశాలపైనే ఎజెండా రూపొందించారు. అయితే, కౌన్సిల్ సమావేశంలో ప్రజాసమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావనకు తీసుకొస్తారా? ఎజెండాలోని అంశాలకు ఒకేఅంటూ చప్పట్లు కొట్టి ఆమోదం తెలిపి బయటకు వస్తారా? అనేది ఆశక్తిగా మారింది.

కొలిక్కిరాని డంపింగ్ యార్డు..

రామగుండం బల్దియాలో దీర్ఘకాలికంగా వేధిస్తున్న అతి ప్రధాన సమస్య డంపింగ్ యార్డు. ఈ సమస్యను మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పరిష్కరించలేక పోతోందనే అపవాదను మూటగట్టుకుంటోంది. నాసిరకంగా అభివృద్ధి పనులు చేయడం, వాటిపై ఉదాసీనంగా వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. నగరంలో లోపించిన పారిశుధ్యం, ఆ విభాగంలో ఇంధనం అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంపైనా బల్దియా తీరు అనుమానాలకు తావిస్తోంది. చెరువుల కబ్జాదారులపై చర్యలు లేకపోవడం, వీధిదీపాల నిర్వహణ గాలికి వదిలేయడం, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుక్కల బెడదను కూడా నియంత్రించకపోవడం, ఎఫ్ఎస్టీపీపై అవగాహన కల్పించకపోవడం తదితర అనేక సమస్యలు నగరవాసులను వెంటాడుతూనే ఉన్నాయి.

నిలిచిన అభివృద్ధి పనులపై పట్టింపేది?

- పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ.8కోట్లతో మల్టీ కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్, విఠల్‌నగర్‌లో రూ.5కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ సముదాయం పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి.
- హనుమాన్‌నగర్‌లో రూ.4కోట్లతో ఆడిటోరియం, రూ.9.5 కోట్లతో కమ్యూనిటీ హాళ్లు, రూ.2కోట్లతో సీనియర్ సిటిజన్ క్లబ్, రూ.3కోట్లతో స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం, రూ.కోటితో పశువైద్యశాల తదితర పనులు ఇంకా ప్రారంభించనేలేదు.
- ప్రశాంత్‌నగర్‌లో మల్కాపూర్ చెరువును మినీ ట్యాంక్ బండ్ మార్చే పనులు పూర్తికాలేదు. పర్యవేక్షణ లేక చెరువు శిఖం కబ్జాకు గురవుతోందనే ఆరోపణలు ఉన్నాయి.
- విఠల్‌నగర్, ఎన్టీఆర్‌నగర్‌లో సుమారు రూ.9 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్ భవనాలు పూర్తికాలేదు.
- ఆస్తిపన్నులోంచి 8 శాతం లైబ్రరీ సెస్ కింద గ్రంథాలయానికి ఏటా రూ.80 లక్షలకు పైగా బల్దియా చెల్లిస్తోంది. కానీ, గ్రంథాలయానికి ఇప్పటివరకు పక్కా భవనం నిర్మించ లేదు.



సాక్షి | Special Story

- ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కీలక శాఖల్లో మహిళా అధికారులు
- సొంత నిర్ణయాలతో తమదైన ముద్ర
- పథకాలను ప్రజలకు చేరుస్తూ, సమస్యల పరిష్కారం
- పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిస్తూ ఆదర్శం

పాలనలో ఆమె సంతకం

ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలువురు మహిళా అధికారులు. సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ పాలనలో తమదైన ముద్ర వేస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, వారి సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉంటున్నారు. పురుష అధికారులతో సమానంగా విధులు నిర్వహిన్నారు. కిందిస్థాయి నుంచి మొదలుకొని జిల్లాస్థాయి అధికారిగా ఉంటూ ప్రజలకు సేవలందిస్తూ ఉన్నతాధికారుల మన్ననలు పొందుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీస్, న్యాయ, రెవెన్యూ, విద్య, వైద్యం, మెప్మా, వ్యవసాయశాఖ తదితర శాఖల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారు. – సాక్షి,పెద్దపల్లి/కరీంనగర్ అర్బన్

కీలక స్థానాల్లో వారే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలు శాఖల్లోని కీలకమైన స్థానాల్లో మహిళా అధికారులే ఉన్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిమ, జగిత్యాల జిల్లా కోర్టు న్యాయమూర్తిగా నీలిమ, కరీంనగర్ కలెక్టర్‌గా పమేలా సత్పతి, పెద్దపల్లి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా అరుణశ్రీ, పెద్దపల్లి డీసీపీగా డాక్టర్ చేతన, వేములవాడ ఏఎస్పీగా శేషాద్రినిరెడ్డి, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్‌పేయ్, కరీంనగర్ డీఎంహెచ్‌వోగా సుజాత, డీఏవోగా భాగ్యలక్ష్మి, జగిత్యాల డీఏవోగా వాణి, కరీంనగర్ సంక్షేమ అధికారిగా సరస్వతి, ఆర్టీసీ ఆర్ఎంగా సుచరిత, రామగుండం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా హిమబిందు సింగ్, పెద్దపల్లి సహకార శాఖ అధికారి శ్రీమాల, పెద్దపల్లి డీఈవోగా మాధవి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారిగా కల్పన, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ అదనపు కమిషనర్‌గా నాయిని సుప్రియ.. ఇలా.. వివిధ శాఖల్లో మహిళా అధికారులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆలోచనా విధానం మారాలి

జీవితంలో అనేక పాత్రలు పోషిస్తున్నా.. మహిళలపై ఇప్పటికీ దాడులు జరుగుతున్నాయి. ఈ అనాగరిక ధోరణి నుంచి మనిషి ఆలోచనా విధానం మారాలని నిపుణులు సూచిస్తున్నారు. రాజకీయ రంగంలోనూ మహిళలు దూసుకెళ్తున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుతో వారి ప్రాతినిధ్యం మరింత పెరిగే అవకాశాలున్నాయి. ఏ సంస్థలోనైనా, ఏ రంగంలోనైనా తగిన శిక్షణ, సానుకూల వాతావరణాన్ని కల్పిస్తే వారు అనూహ్య ఫలితాలు సాధిస్తారు.

మహిళల ప్రాతినిధ్యం పెరిగింది



అటెండర్ నుంచి అంతరిక్షం వరకు ప్రతీ రంగంలో మహిళల ప్రాతినిధ్యం పెరిగింది. నాకు అదనపు కలెక్టర్‌గా సేవలందించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. మహిళలు రాజకీయాల్లో వెనకబడి ఉన్నారు. సివిల్ సర్వీసులోకి వచ్చేవారు 7 శాతమే. విజయానికి ఆడ, మగ అనే తేడా లేదు. లక్ష్యాలను నిర్దేశించుకొని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఆడపిల్లలను ప్రోత్సహించేవారి సంఖ్య పెరుగుతోంది. అది వంద శాతానికి చేరాలి. – లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్(రెవెన్యూ), కరీంనగర్

యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది



పరిపాలనలో మహిళల భాగస్వామ్యం పెరిగింది. జిల్లాలో చైతన్యం ఎక్కువ. ఆడపిల్లలంటే ఒకప్పుడు వివక్ష ఉండేది. ఇప్పుడు మార్పు వచ్చింది. వ్యవసాయశాఖకు జిల్లా అధికారిగా పని చేయడం సంతోషంగా ఉంది. పల్లెల్లో సమావేశాల్లో పాల్గొన్నప్పుడు యువతుల్లో చైతన్యం కనిపిస్తోంది. స్వయం ఉపాధి పొందేవారు, ఉన్నత విద్యనభ్యసిస్తున్నవారిని చూస్తే గర్వంగా అనిపిస్తోంది. – భాగ్యలక్ష్మి, డీఏవో, కరీంనగర్

చదువుతోనే సాధికారత



చదువుతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుంది. ఎంచుకున్న రంగంలో ప్రతిభ చాటేందుకు ఇష్టంగా ముందుకుసాగాలి. ఎవరి జీవితం అనతికాలంలో ఉన్నతస్థానానికి చేరదు. కఠోర శ్రమ అవసరం. లక్ష్య సాధనకు నిర్విరామ కృషి ఉండాలి. ఆడవాళ్లు ఉన్నత చదువులు, ఉద్యోగాలకు పోటీపడాలి. ఏ రంగాన్ని ఎంచుకున్నా అందులో పరిపూర్ణత సాధించాలి. – అరుణశ్రీ, అదనపు కలెక్టర్, పెద్దపల్లి

చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆత్మనిర్భరత, నిర్ణయం తీసుకునే అధికారం కలిగి ఉండాలి. విద్య, వృత్తి, వివాహం, కుటుంబ వ్యవహారాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలి. ప్రభుత్వాలు మహిళల కోసం చేసిన చట్టాలు, న్యాయ సేవలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి. పోలీస్‌శాఖలో గతంతో పోలిస్తే మహిళా సిబ్బంది ప్రాతినిధ్యం పెరిగింది. – డాక్టర్ చేతన, డీసీపీ, పెద్దపల్లి

ఆడపిల్లలను ప్రోత్సహించాలి



ఆడపిల్లలకు వయసు రాగానే పెళ్లి చేయాలని తల్లిదండ్రులు ఆరాటపడుతుంటారు. అలా కాకుండా, వారు ఎంచుకున్న లక్ష్యాలు సాధించేవరకు ప్రోత్సహించాలి. లక్ష్యసాధనకు తోడ్పాటునందించాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆడవారిని ఎలా గౌరవించాలో నేర్పించాలి. మగ, ఆడ అనే తేడా లేకుండా అందరూ సమానమేనన్న భావన కలిగించాలి. – మాధవి, డీఈవో, పెద్దపల్లి

చాలెంజ్‌గా తీసుకుంటా



కోల్‌సిటీ(రామగుండం): కొన్ని రంగాల్లో మహిళలు చిన్నచూపునకు గురవుతున్నారు. వాటిని పట్టించుకోకుండా ప్రతీ పనిని చాలెంజ్‌గా తీసుకోవాలి. నేను చాలెంజ్‌తో ముందుకు సాగుతున్నా. పురుషుల కన్నా మహిళకు ఇల్లు, ఫ్యామిలీ, ఉద్యోగం, అనారోగ్య సమస్యలు చాలా ఉంటాయి. లీడర్‌షిప్ క్వాలిటీస్ విషయంలో సపోర్ట్ దొరకదు. నిలోఫర్ ఆస్పత్రిలో హెచ్‌వోడీగా చేస్తున్న నన్ను, ప్రభుత్వం అడిషనల్ డీఎంఈ క్యాడర్ హోదా కల్పిస్తూ ప్రమోషన్ ఇచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసిన రామగుండంలోని సిమ్స్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా రెండున్నరేళ్ల క్రితం బాధ్యతలు అప్పగించారు. తొలి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన కొంతకాలం ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రొఫెషనల్ ఒత్తిళ్లతో బిజీగా ఉన్నా కుటుంబానికీ సమయం కేటాయిస్తా. – డాక్టర్ హిమబిందు సింగ్, ప్రిన్సిపాల్, సిమ్స్, గోదావరిఖని

ఒక్క నెల జీతమూ తీసుకోలే..

- సర్దుబాటు తర్వాత 6 నెలలు విధులు
- ఉమ్మడి జిల్లాలో రిటైరైన వీఆర్‌ఏలు 80 మంది
- రిటైర్‌మెంట్ బెనిఫిట్ కూడా పొందలే..
- వారసులకు ఉద్యోగాలు ఇవ్వని గత ప్రభుత్వం
- కాంగ్రెస్ సర్కారు నిర్ణయం కోసం ఎదురుచూపు



ఉద్యోగులుగా గుర్తించాలని ఆందోళన చేస్తున్న వీఆర్‌ఏలు (ఫైల్)

సుల్తానాబాద్(పెద్దపల్లి): వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ డిమాండ్ ఏళ్లనాటిది.. ఎట్టకేలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వారిని క్రమబద్ధీకరిస్తూ జీవో 81, 85, 98 జారీ చేసింది. వీటి కారణంగా సర్దుబాటు జరిగి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 80 మంది వీఆర్‌ఏలు 6 నెలలు తమ కేటాయించిన విధులు నిర్వహించారు. చివరకు ఒక్క నెల జీతం కూడా తీసుకోకుండానే రిటైరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య 600. కరీంనగర్ జిల్లాలో 25 మంది, పెద్దపల్లిలో 15 మంది, జగిత్యాలలో 20 మంది, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 20 మంది ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్‌మెంట్‌కు దగ్గర ఉన్నామని, తమ వారసులకు ఉద్యోగాలివ్వాలని వారు కోరినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఎన్నికలు వచ్చాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వమైనా తమకు ఉద్యోగం ఇస్తుందని రిటైరైన వీఆర్‌ఏల వారసులు ఎదురుచూస్తున్నారు.

మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు..

60 ఏళ్లు నిండిన వీఆర్‌ఏలు సర్దుబాటు తర్వాత ఒక్క నెల జీతం కూడా తీసుకోకుండా రిటైరయ్యారు. వీరు తమ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని మొరపెట్టుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఒక నెల, ఒక సంవత్సరం, రెండేళ్ల సర్వీస్ ఉన్నవారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినా.. ఉద్యోగ విరమణ తర్వాత వారు రోడ్డున పడ్డారు. ఈ విషయంలో పునరాలోచన చేయాలని అప్పటి మంత్రుల చుట్టూ తిరిగి, అర్జీలు ఇచ్చినా, నిరసన తెలిపినా ఫలితం లేకపోయింది. రిటైరైనవారికి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించలేదు.

రెండు వర్గాలుగా విభజన..

గత ప్రభుత్వం జీవో 81 ప్రకారం వీఆర్‌ఏలను రెండు వర్గాలుగా 61 ఏళ్లలోపు, 61 ఏళ్ల పైబడిన వీఆర్‌ఏలు అని విభజించింది. 61 ఏళ్లలోపు వయసువారిని విద్యార్హతను బట్టి 2023లో అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఉద్యోగాల్లో సర్దుబాటు చేసింది. 61 ఏళ్లు దాటి, రిటైరైన వారి వారసులకు వారి విద్యార్హతలను బట్టి అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయించింది.

జీవో 81పై పునరాలోచన చేయాలి

గత ప్రభుత్వం జారీ చేసిన జీవో 81పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పునరాలోచన చేయాలని 55 ఏళ్ల నుంచి 61 ఏళ్లలోపు వయసున్న వీఆర్‌ఏలు కోరుతున్నారు. వీరితోపాటు రిటైరైనవారికి ప్రభుత్వం న్యాయం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శాసన మండలిలో కోరారు.

45 ఏళ్లు పని చేసిన



నేను వీఆర్‌ఏగా 45 ఏళ్లు పని చేసిన. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 81 ప్రకారం లష్కర్‌గా ప్రమోషన్ వచ్చింది. 6 నెలలు జీతం తీసుకోకుండా, ఎలాంటి ప్రయోజనం పొందకుండానే 2023 ఆగస్టు 1న రిటైరయ్యాను. నా కుటుంబం రోడ్డున పడింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా న్యాయం చేయాలి. నా వారసుడికి ఉద్యోగం ఇవ్వాలి. – భోగం ఎల్లయ్య, కేశనపల్లి, ముత్తారం మండలం, పెద్దపల్లి

ఎలాంటి ప్రయోజనం లేదు



నేను 40 ఏళ్లు వీఆర్‌ఏగా పని చేసిన. ఓఎస్‌డీగా ప్రమోషన్ వచ్చినా.. నెల జీతం కూడా తీసుకోలేదు. ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండానే 2024, జూన్ 6న రిటైర్మెంట్ తీసుకున్నాను. గత సర్కారు మాకు అన్యాయం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలి. రిటైరైన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగం ఇచ్చి, ఆదుకోవాలి. – పులిపాక భూమయ్య, రామకృష్ణాపూర్, పెద్దపల్లి

నా కుటుంబాన్ని ఆదుకోవాలి



వీఆర్‌ఏలను గత ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించింది. నేను అనారోగ్య కారణాలతో పని చేయలేని స్థితిలో ఉన్నా మిషన్ భగీరథలో బలవంతంగా హెల్పర్‌గా చేరాను. 6 నెలలు గడవకుండానే, నెల జీతం తీసుకోకుండానే 2024, జనవరి 1న రిటైరయ్యాను. నా వారసుడికి ఉద్యోగం ఇచ్చి, నా కుటుంబాన్ని ఆదుకోవాలి. – మొగురం రాజయ్య, వడ్కాపూర్, జూలపల్లి మండలం, పెద్దపల్లి

క్లుప్తంగా

ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్లు నమోదు



టీచర్లను సత్కరిస్తున్న డీఈవో మాధవి

పెద్దపల్లిరూరల్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి ఇన్‌స్పైర్ అవార్డులకు ఐదేసి చొప్పున నామినేషన్లను సత్వరమే నమోదు చేయాలని డీఈవో మాధవి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఉపాధ్యాయులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో డీఈవో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఈనెల 15వ తేదీ వరకు సమాజహితం కోసం ఉపయోగపడే ఆవిష్కరణలతో నమోదు చేయాలని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తములుగా ఎంపికై అవార్డులు అందుకున్న సంపత్‌కుమార్, అంజన్‌కుమార్, రమేశ్‌ను ఈ సందర్భంగా సత్కరించారు. రవినందన్‌రావు, పీఎం షేక్, సురేంద్రప్రసాద్, రాజేశ్వర్‌రావు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జామ, వరి పంటల పరిశీలన



పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త శ్రీనివాస్

రామగిరి(మంథని): రత్నాపూర్, ఆదివారంపేట గ్రామాల్లో రత్నాపూర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ మంగళవారం జామ, వరి పంటలను పరిశీలించారు. అధిక వర్షాలకు జామతోటల్లో ఈగవ్యాప్తి ఎక్కువగా ఉందని గుర్తించారు. నివారణకు లింగాకర్షణ బుట్టలను తోటల్లో ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధిక వర్షాలతో రైతులు వరి పొలాలను ఆరబెట్టలన్నారు. నత్రజని ఎరువులు వేయడం ఆపివేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త వెంకన్న, ఉద్యాన శాస్త్రవేత్త భాస్కరరావు, మృతిక శాస్త్రవేత్త కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



హరిశ్చంద్రప్రసాద్



కార్తికేయ

రామగిరి(మంథని): కల్వచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్రం హరిశ్చంద్ర ప్రసాద్, దర్ముల కార్తికేయ ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి జూనియర్ ఇంటర్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శోభన్‌రావు మంగళవారం తెలిపారు. హరిశ్చంద్ర ప్రసాద్ పదో తరగతి, దర్ముల కార్తికేయ తొమ్మిదో తరగతి చదువుతున్నారని పేర్కొన్నారు. ఈనెల 1న జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చారని వివరించారు. అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ బోనగాని హరిక, ఫిజికల్ డైరెక్టర్ సతీశ్, ఉపాధ్యాయులు తదితరులు విద్యార్థులను అభినందించారు.

పోరాట స్ఫూర్తికి ప్రతీక ఐలమ్మ





ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, నివాళి అర్పిస్తున్న మక్కాన్‌సింగ్

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: వీరవనిత చిట్యాల ఐలమ్మ తెలంగాణ పోరాట స్ఫూర్తికి ప్రతీక అని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ కొనియాడారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న ధీశాలి ఐలయ్మ అని కొనియాడారు. బీసీ సంక్షేమ అధికారి అనిల్‌కుమార్, ఇంటర్ నోడల్ అధికారి కల్పన పాల్గొన్నారు.

ఆత్మగౌరవానికి ప్రతీక..

గోదావరిఖని: ఆత్మగౌరవానికి ప్రతీక చిట్యాల ఐలమ్మ అని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్) రాజు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్, నాయకులు బొంతల రాజేశ్, ముస్తఫా, మారెల్లి రాజిరెడ్డి, ఉరిమెట్ల రాజలింగం, దీటి బాలరాజు, కలవల శిరీష, తిప్పారపు శ్రీనివాస్, మామిడి సతీశ్, గడ్డం శ్రీనివాస్, జనగామ సాయిలు, వెదిర కొండయ్య, బండి లక్ష్మణ్, ఇజ్జగిరి కొమురక్క తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఈశ్వర్

ధర్మపురిలో..

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రంలో నిర్వహించిన ఐలమ్మ వర్ధంతిలో మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, నాయకులు బలరాంరెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీధర్, రాము, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి ఎదుట బైఠాయింపు

ఓదెల(పెద్దపల్లి): న్యాయం చేయాలంటూ ఓ వివాహిత తన అత్తింటి ఎదుట బైఠాయించిన ఘటన కొలనూర్ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన జంగ సంజీవరెడ్డికి వీణవంక మండలంలోని చల్లూరుకు చెందిన వనజతో పెళ్లయింది. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొన్నేళ్లకు సంజీవరెడ్డి మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. దీంతో వనజ తన పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. తనకు, పిల్లలకు ఆస్తిలో సగభాగం ఇవ్వాలంటూ ఇటీవల అత్తింటి ఎదుట బైఠాయించింది. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో వారం రోజులుగా ఠాణాలో మాట్లాడుకుందామని నమ్మించిన భర్త ప్రస్తుతం ఏమీ లేదని చెప్పడంతో మంగళవారం మళ్లీ అత్తింటి ఎదుట బైఠాయించింది. వనజ పిల్లలతో కలిసి వస్తుండటాన్ని గమనించిన సంజీవరెడ్డి, తల్లిదండ్రులు ఇంటికి తాళం వేసి పరారయ్యారు. ఈ విషయమై ఎస్సై అశోక్‌రెడ్డిని వివరణ కోరగా బుధవారం ఇరువర్గాల వారిని కూర్చోబెట్టి, మాట్లాడతామని పేర్కొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

జూలపల్లి(పెద్దపల్లి): పారదర్శకంగా ఓటరు జాబితా తయారు చేయాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు. పెద్దాపూర్, జూలపల్లిలో ఆయన మంగళవారం పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితా తయారీపై ఆరా తీశారు. పారిశుధ్యం నిర్వహణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



సహస్ర శివలింగార్చన

గోదావరిఖనిటౌన్: ఐదో డివిజన్ రాజ్యలక్ష్మీకాలనీ శ్రీసిద్ధి వినాయక గణపతి మండపంలో మంగళవారం సహస్ర శివలింగార్చన, పాలాభిషేకం, బిల్వ పత్రాలతో ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వూరగొండ రమేశ్, ప్రధాన కార్యదర్శి దబ్బెట శంకర్, గాదె సమ్మయ్య, శంకర్, సాంబయ్య, కేపీ రాజ్‌కుమార్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో వసతులు మెరుగు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి భవిత కేంద్రానికి వచ్చేలా చూడాలన్నారు. పిల్లలకు అవసరమైన బోధన పరికరాల కోసం రూ.30వేలను మంజూరు చేశామని తెలిపారు. ఈ కేంద్రాలకు వచ్చే పిల్లలకు సర్టిఫికెట్లు అందించాలని డీఆర్డీవోను ఆదేశించారు. సమన్వయకర్త అజీమ్, ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలి

జిల్లాలో ఇందిరా మహిళాశక్తి కింద ఎంపికైన లబ్ధిదారులకు యూనిట్లను వెంటనే గ్రౌండింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. పశుసంవర్ధకశాఖకు చెందిన యూనిట్ల మంజూరుపై సమీక్షించారు. పశువులు, పౌల్ట్రీ తదితర యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని పేర్కొన్నారు. బల్క్‌కూలింగ్ యూనిట్ల నిర్వహణకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పశువులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని పేర్కొన్నారు. డీఆర్డీవో రవీందర్, పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సంపత్‌కుమార్‌ను కలెక్టర్ శ్రీహర్ష సత్కరించారు.

సీఎంఆర్ డెలివరీ చేయకుంటే చర్యలు

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని రైస్‌మిల్లర్లు సీఎంఆర్‌ను సకాలంలో డెలివరీ చేయడంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో బియ్యం డెలివరీపై సమీక్షించారు. ఈ నెలాఖరులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని ఆదేశించారు. గతేడాది యాసంగి, వానాకాలం సీజన్ల సీఎంఆర్ డెలివరీ లక్ష్యాలను మిల్లుల వారీగా పూర్తి చేయాలని అన్నారు. అలాగే జిల్లాలోని రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ సరుకుల పంపిణీని ఆకస్మికంగా తనిఖీలు చేయాలని సివిల్ సప్లయి అధికారులను ఆదేశించారు. దుకాణాలలో రిజిష్టర్ ప్రకారం నిల్వలను పరిశీలించాలని సూచించారు. డీఎస్‌వో రాజేందర్, డీఎం శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జాప్యంలేకుండా కొత్త మీటర్లు ఇవ్వండి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్/రామగుండం: విద్యుత్ సమస్యలపై ప్రజావాణి ద్వారా అందిన అర్జీలను పరిశీలించి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. రాఘవాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఈ బొంకూరి సుదర్శన్‌తో కలిసి మంగళవారం సర్కిల్‌స్థాయి సమావేశం నిర్వహించారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వినియోగదారులకు అందుబాటులో ఉండాలన్నారు. పనుల నిమిత్తం వచ్చే వారిని ఇబ్బందులకు గురిచేసినా, లంచం కోసం వేధిస్తున్నట్లు తన దృష్టికొచ్చినా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన హెచ్చరించారు. ఈనెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ మీటర్లు లేని పేదలను గుర్తించి 250 కిలోవాట్, 500కేవీ సామర్థ్యంతో కొత్త మీటర్లు మంజూరు చేయాలన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేసి, జరిమానాలు వసూలు చేస్తామని, ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అంతకుముందు రామగుండం, మంథని ప్రాంతాల్లోని ఆకెనపల్లి, ఖానాపూర్, ఎగ్లాస్‌పూర్ తదితర ప్రాంతాల సబ్‌స్టేషన్లను పరిశీలించి పనితీరుపై ఆరా తీశారు. మంథని ఈఆర్‌వో, డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేశారు. ఈ సమావేశంలో సర్కిల్ పరిధిలోని పలువురు అధికారులు తదతరులు పాల్గొన్నారు.

మల్టీజోన్-1 పరిధిలో పలువురు సీఐల బదిలీ

గోదావరిఖని: మల్టీజోన్-1 పరిధిలోని పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పదిమంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. వీరిలో మల్టీజోన్ ఐజీ పరిధిలో వెయిటింగ్‌లో ఉన్న ముగ్గురు సీఐలను రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పేరు	ప్రస్తుతం	బదిలీ
రాజనర్సయ్య	వెయిటింగ్	వీఆర్, రామగుండం
కె.రవీందర్	వెయిటింగ్	జీడీకే-1టౌన్, రెండో సీఐ
డి.కమలాకర్	వెయిటింగ్	సీసీఎస్-3, రామగుండం

వినాయక విగ్రహాలకు జియోట్యాగింగ్ పూర్తి

- రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్
- నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు



వినాయక విగ్రహాలకు జియోట్యాగింగ్ చేస్తున్న పోలీస్ అధికారులు

గోదావరిఖని: రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో వినాయక విగ్రహాల జియోట్యాగింగ్ పూర్తిచేసినట్లు సీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జియోట్యాగింగ్ ద్వారా విగ్రహాల మరింత భద్రత కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కమిషనరేట్‌లోని పెద్దపల్లి జిల్లాలో 2,405, మంచిర్యాల జిల్లాలో 2,251 విగ్రహాలకు ఆన్‌లైన్‌లో అనుమతి మంజూరు చేశామని పేర్కొన్నారు. మండప నిర్వాహకుల పూర్తిసమాచారాన్ని వెబ్ అప్లికేషన్ ద్వారా క్షేత్రస్థాయిలో జియోట్యాగింగ్‌కు అనుసంధానం చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తినా, సమస్యాత్మక ప్రాంతాలతో పాటు మండపాల వద్ద ఎలాంటి సెక్యూరిటీ సమస్య వచ్చినా అప్లికేషన్‌లోని లోకేషన్ ఆప్షన్‌ను నొక్కగానే వెంటనే మండపం ఏర్పాటు చేసిన ప్రాంతం పోలీసు శాఖకు తెలుస్తుందన్నారు. దీనిద్వారా క్షణాల్లో అక్కడకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

బీజేపీలోనే అత్యధిక మంది కార్యకర్తలు



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్, పర్వతాలు

పెద్దపల్లిరూరల్: ప్రపంచంలోనే అత్యధికంగా కార్యకర్తలు కలిగిన పార్టీగా బీజేపీ అగ్రస్థానంలో ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లాస్థాయి సభ్యత్వ నమోదు కార్యక్రమం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగింది. పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేత, నాయకుడు గోమాస శ్రీనివాస్, సభ్యత్వనమోదు ఇన్‌చార్జి పోచం హాజరై మాట్లాడారు. దేశంలోని ఎక్కువరాష్ట్రాల్లో అధికారంలో ఉండడంతో పాటు అత్యధిక మంది ప్రజాప్రతినిధులు ఉన్న పార్టీగా బీజేపీ రికార్డు సృష్టించిందన్నారు. దేశాన్ని పాలించిన పార్టీలు అనేక కుంభకోణాలు, అవినీతి ఊబిలో కూరుకుపోయాయని ఆరోపించారు. నరేంద్రమోదీ సారథ్యంలో గత పదేళ్ల పాలన నీతివంతంగా సాగిందని తెలిపారు. అందుకే మూడోసారి కూడా ప్రధానిగా దేశాన్ని పాలించే అవకాశం మోదీకే ప్రజలు అప్పగించారని అన్నారు. మోదీ నీతివంతమైన పాలనను చూసే సభ్యత్వం తీసుకోవాలని కోరారు. ప్రతిబూత్ స్థాయిలో కనీసం 200మంది సభ్యత్వమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిలారపు పర్వతాలు, రాజ్‌గోపాల్, మేకల శ్రీనివాస్, తంగెడ రాజేశ్వర్‌రావు, సంపత్‌రావు, కందుల శ్రీనివాస్, సంధ్యారాణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడితో భేటీ



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు తదితరులు

పెద్దపల్లిరూరల్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పీసీసీ) అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు ఆయన వెంట ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

పెద్దపల్లిరూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట మంగళవారం అపస్మారక స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించడంతో వచ్చి, స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి పంపించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతని మృతదేహాన్ని అక్కడే మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. వివరాలు తెలిసినవారు 87126 56506, 87126 56507 ఫోన్ నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

కుక్క దాడిలో 10 మందికి గాయాలు

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేటలో కుక్క దాడిలో 10 మంది గాయపడ్డారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం వివిధ పనుల నిమిత్తం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న, బైక్‌లపై వెళ్తున్నవారిపై కుక్క దాడి చేసింది. గాయపడినవారు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, చికిత్స పొందారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు వాటిని దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'ట్రినిటీ'లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పోటీ పడ్డారు. మొత్తం 27 టీంలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 15 టీంలు రెండో రౌండ్‌కు చేరుకున్నాయని అకాడమిక్ డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. వినూత్న ఆవిష్కరణలకు ఈ కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందని కళాశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ సమ్మయ్య, ప్రశాంత్‌కుమార్, హెచ్‌వోడీలు మంజుల, భార్గవి, నరేశ్, ప్రిన్సిపాల్ మణిగణేశ్, ఏవో సురేశ్ తదితరులున్నారు.